# అద్దె ఇల్లు



ఒరియా మూలం:
అనంత్‌ప్రసాద్ పండా

తెలుగు:
డి. కామేశ్వరి
డి. శైలజ


హరిహర సామంతరాయ్ మొదటిసారి ఆఫీసరుగా ఉద్యోగంలో చేరడానికి కటక్ వచ్చినపుడు ఆ టౌన్ యింకా అంత వృద్ధి కాలేదు. అపుడు అక్కడ అన్నీ పెంకుటిళ్ళు, మామూలు పాయిఖానాలు వుండేవి. అలాంటి ఒక యింట్లో హరిబాబు ముందు కాపురం పెట్టాడు. వర్షాకాలంలో యింటిముందు మట్టి రోడ్డు బురదతో నిండిపోయి నడవడానికి నానా యిబ్బందిగా వుండేది. రోడ్డుపక్క వున్న కుళ్లు కాలవ వర్షం పడగానే నిండిపోయి యింటి వరండా దాటుకుని వచ్చేసేది. పెంకుల సందు నించి నీళ్ళు టపటపమని రాలి యిల్లంతా నిండిపోయేది. ఆ అవస్థలన్నీ చూసి హరిబాబుకి విసుగుపుట్టినా యేం చెయ్యడానికి పాలుపోయేది కాదు. ఇంతకంటె మంచి యిల్లు ఆ వూర్లో దొరకడం కష్టం అని అతనికి తెలుసు. ఈ బాధలన్నీ పోవాలంటే ఓ స్వంత ఇల్లు కట్టుకోవాలని తీర్మానించాడు. తన మనసులో ఆలోచన భార్య చతురకి చెప్పాడు. చతుర అంతా విని "మీకేమి మతి పోయిందా యేమిటి? గవర్నమెంటు వుద్యోగాలన్నీ మర్రిచెట్టు నీడలాంటివి. ఈ రోజీక్కడ—మరో నాలుగు రోజులుపోతే యెక్కడికి బదిలీ చేస్తారో? ఎల్లకాలం యిక్కడే యెలా వుంటాం? యింటికిప్పటినుంచి యేం తొందర లెండి! తరువాత చూసుకుందాం. ముందు నా మాట విని ఆ డబ్బుతో నాకు నగలు చేయించండి. అవి వుంటే మనవసరానికి యెప్పుడైనా పనికొస్తాయి" అని సలహా పారేసింది. ఆఖరికి భార్య మాటలకి తల ఒగ్గక తప్పలేదు హరిబాబుకి. అపుడు కటక్‌లో ఇళ్ళ స్థలాలు చాలా చవగ్గా వుండేవి. స్థలం కొనడానికి యిచ్చిన అడ్వాన్సు డబ్బు తిరిగి తీసుకుని చతుర కోరిన ప్రకారం భార్యకి నగలు చేయించడానికి యిచ్చాడు.

ఇది జరిగిన కొన్నాళ్ళకే హరిబాబు తండ్రి గ్రామంనించి ఉత్తరం రాశాడు—అందులో ముసలాయన "అబ్బాయీ! నీకోసం అన్ని తెగనమ్మి నిన్ను పెంచి పెద్దచేసి చదువు సంధ్యలు చెప్పించాను. నువ్వు యిప్పుడు ఆఫీసరు వయ్యావు. బాగానే వుంది కాని యిక్కడ యింటిస్థితి అధ్వాన్నంగా వుంది. రేపో మాపో కూలిపోయేలా వుంది. నీ వా వూర్లో యిల్లు కట్టేబదులు, యీ యిల్లు బాగు చేయించి మిద్దె యిల్లు కట్టిస్తే బావుంటుంది. నే నింక యెంత కాలం వుంటాను. ఆ తరువాత నీవు నీ పిల్లలే కదా అనుభవించేది. బాగా ఆలోచించుకో" అని రాశాడు.

ఉత్తరం చదివిన తరువాత హరిబాబుకి తండ్రి రాసింది నిజమే ననిపించింది. ఇప్పుడు యిక్కడ యేన్నో మేడలు కడ్తున్నారు. తను ఒకవేళ యిక్కడ మిద్దెయిల్లు కట్టినా ఆ పెద్ద మేడల మధ్య వెలవెల బోతుంది. అదే పల్లెటూరిలో అయితే గొప్పగా వుంటుంది. రిటైరయ్యాక యీ టౌనులో వుంటే యిల్లు గడవడం కష్టం. గ్రామంలో అయితే అన్నీ చవక. రిటైరయ్యాక అక్కడే వుండచ్చు అని ఆలోచించి తన ఆలోచన చతురకి చెప్పాడు. ఆమెకి ఆ పల్లెలో యింటిమీద డబ్బు ఖర్చుపెట్టడం



యిష్టంలేదు. కాసేపు అసంతృప్తిగా సణిగింది. ఆఖరికి ఎలాగో వప్పుకుంది.

హరిబాబు వూర్లో యిల్లు కట్టించడం ఆరంభించాడు. ఆ వూరు వెళ్ళాలంటే రెండుమూడు చెరువులు, నదులు దాటుకుని వెళ్ళాలి. గట్టిగా రెండురోజులు వర్షం పడినా నీరు ఏరు దాటి పొంగిపోతూంటూంది. అలాంటి స్థితిలో అక్కడ యిల్లు కట్టించడం ఎంత నష్టమో తెలుసుకొనేవేళకి పరిస్థితి చేయిదాటి పోయింది. అప్పటికే చాలా డబ్బు యిటుకలు, సిమెంటు మీద ఖర్చయింది. ఇప్పుడు వెనక్కి తిరిగితే నష్టం తప్ప లాభంలేదు. హరిబాబు చాలా ఇరకాటంలో పడ్డాడు. కాని యేదైతే అదే అవుతుందని యిల్లుపని ఆపలేదు. దాని ఫలితం కటక్‌లో అలాంటి యిల్లు కడితే ఎంత అవుతుందో అంతకు రెట్టింపయింది ఆ పల్లెటూరిలో.

ఇల్లు కట్టడం పూర్తి అయింది. గృహప్రవేశం రోజుకి హరిబాబు సపరివారంగా పల్లెకి వెళ్ళాడు. చాలా భారీయెత్తున గృహప్రవేశం జరిగింది. రకరకాల పిండివంటలతో వూరివాళ్ళంతా సుష్ఠుగా భోంచేశారు. ఆ వూర్లోనేకాదు చుట్టుపక్కల ఐదారు గ్రామాలలో అలాంటి యిల్లు చూడలేదన్నారు అంతా. హరిబాబు కనక అలాంటి యిల్లు కట్టించగలిగాడు అందరికీ చేతనవుతుందా అని పొగిడారు. హరిబాబు పుణ్యమా అని మేము ఇలాంటిల్లు కళ్ళార చూడగలిగాం అని వుబ్బేశారు. హరిబాబు ఆ పొగడ్తలు విని పొంగిపోయాడు.

కాని.... ఆ సంబరం మూన్నాళ్ళ ముచ్చటయిపోయింది. గృహప్రవేశం మర్నాడే హరిబాబు ముసలితండ్రి గోవర్ధన్ సామంత్‌రాయ్ డిసెంట్రీతో మంచం పట్టాడు. అలాగే తీసుకు

తీసుకు పదిహేనురోజులకి చచ్చిపోయాడు.తల్లి ముందే చచ్చిపోయింది. ఇప్పుడు యిహ హరి బాబుకి యింతపెద్ద యిల్లు యెలా మేనేజ్ చెయ్యాలనే చింత పట్టుకుంది. ఆ పల్లెటూరిలో అద్దె కిద్దామన్నా వుండేవాళ్ళుండరు.

దానికి తోడు హరిబాబు తండ్రి పోగానే వూర్లో రకరకాల వ్యాఖ్యానాలు బయలుదేరాయి. "వాళ్ళ ఏడు తరాల్లో ఎవరూ ఇలాంటి యిల్లు కట్టలేదు. ఇప్పుడు హరిబాబు కట్టేసరికి వాళ్ళ పూర్వీకులు సహించలేక పోయారు. గృహప్రవేశం అయిందగ్గర నించి ముసలాడు మంచంపట్టి మరి లేవలేదు" అన్నారు కొందరు. మరికొందరు "అదికాదు. వాళ్ళు కట్టిన యిల్లు వాస్తుశాస్త్రం ప్రకారం లేద"న్నారు. "ఇది ఒక్క ముసలాడితో సరికాదు, ముందు ముందు ఇలాంటివి యెన్నవుతాయో చూడండి" అన్నారు కొందరు.

పల్లెటూరిలో యిలాంటి వదంతులు చాలా త్వరగా వ్యాపిస్తాయి. ఇలాంటి కథలు ఎన్నో రంగు రంగులు పులుముకుని హరిబాబు చెవిలో పడ్డాయి. అతడు యెంత యింగ్లీషు చదువులు చదివినా యిలాంటి భావాలు అతని నర నరాల్లోనూ జీర్ణించి వున్నాయి. అందుకే నిజంగానే యిల్లు అచ్చిరాదేమోనని బాధపడ్డాడు. అందుకు తగ్గట్టు చతురకూడా...."చూశారా! నే చెపితే వినిపించుకోలేదు. వద్దంటే ఆ పల్లెటూరిలో అంతిల్లు కట్టారు. చాలుగాని యింక యెలాగో ఆలాగ ఆ యిల్లు వదల్చుకోండి. అమ్మి పారేయండి" అని పోరింది. హరిబాబు యిల్లు అమ్మకానికి పెట్టాడు. కాని అంత పెద్ద యిల్లు ఆ చిన్న వూర్లో యెవరు కొంటారు? అందులోనూ యింటి గురించి అన్ని పుకార్లు బయలుదేరాక? ఎవర్ని అడిగినా 'అమ్మో ఆ యిల్లా? బతికుంటే బలుసాకు తినచ్చు"అనడం మొదలు పెట్టారు.

ఆఖరికి అద్దెకుండడం మాట అటుంచి వూరికే యింట్లో వుండి దీపం పెట్టమన్నా యెవరూ వప్పుకోలేదు. క్రమంగా అంత మంచి యిల్లు పాడుపడడం మొదలుపెట్టింది. హరిబాబు కష్టార్జితం పదివేలు బూడిదలో పోసిన పన్నీరయింది. అలాంటి పల్లెలో యిల్లు కట్టి యెంత పెద్ద తప్పు చేశాడో అర్థం అయి లెంపలు వేసుకున్నాడు. కటక్‌నించి ఆ వూరికి కాని చుట్టుపక్కలలో కాని ట్రాన్స్‌ఫర్ చేయించుకుందామని అతను యెంత ప్రయత్నించినా కుదరలేదు!

* * *

కాలం ముందుకు సాగింది. ఇప్పుడు.కటక్ టౌన్ విపరీతంగా పెరిగిపోయింది. ఎక్కడ పడితే అక్కడ కుక్కగొడుగుల్లా తెల్లారేసరికి కొత్త కొత్త యిళ్లు పుట్టుకొస్తున్నాయి. హరిబాబు ముందున్న యింటికన్న కాస్త మంచి యింట్లోకి మారాడు. కాని కటక్‌లో యిళ్ళ అద్దెలు విపరీతంగా పెరిగిపోయి జీతంలో చాలా మటుకు అద్దెలకే సరిపోతూంది. అందుకని హరిబాబుకి కటక్‌లో మళ్ళీ యిల్లు కట్టుకోవాలన్న ఆలోచన వచ్చింది. ఇన్నాళ్ళు పట్నవాసం అలవాటయ్యాక రిటైరయ్యాకన్నా పల్లెలో వుండాలంటే యెవరికీ మనసొప్పలేదు.

ఆఖరికి కటక్‌లో ఓ యిల్లు కట్టాలని తీర్మానం అయింది—కాని అప్పటికి యిళ్ళ స్థలాలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇదివరలో గజం ఐదు వుండేది యిప్పుడు పదిహేను అయింది. అయినా అవసరం. హరిబాబు స్థలంకొని యిల్లు ఆరంభించాడు. స్థలాలతోపాటు మిగతా వస్తువులు నాలుగింతలు పెరిగాయి. ముందు ధరల్లో పదివేలకి వచ్చే యిల్లు ముప్ఫైవేలు ఖర్చుపెడితేగాని యిల్లు తయారవలేదు. అంత డబ్బు హరిబాబు దగ్గిర యెక్కడుంది? తప్పనిసరిగా ఆఫీసులో లోన్‌కి అప్లయ్ చేశాడు. అపుడు చతుర బుర్రలో మళ్ళీ ఓ అనుమానం ఉదయించింది. "బాగానే వుంది. అప్పు తీసి యిల్లు కట్టారుకాని అది తీర్చేదెలా? మీరు నాలుగేళ్ళలో రిటైరవుతారు, అపుడు పెన్షన్‌తో బతకడమే కష్టం. ఇంటి మీద యెలా అప్పు తీరుస్తారు?"అని సందేహం బయటపెట్టింది. హరిబాబు భార్య మాటలు విని కృంగిపోయాయాడు. ఏం దారి అనుకున్నాడు.

చతుర మళ్ళీ తనే ఒక ఆలోచన చెప్పింది. "మన యింటిని అద్దెకిద్దాం. ఆ అద్దె అప్పు కింద చెల్లవడదాం. అప్పు తీరాక యింట్లోకి వెడదాం. ఎలాగో యిన్నాళ్ళు యిక్కడే వున్నాం గదా, మరో రెండు మూడేళ్ళు కళ్ళు మూసుకుంటే మన కష్టాలు తీరుతాయి" అని ఓదార్చింది. భార్య సలహా ఆచరించక తప్ప లేదు. అంత డబ్బుపెట్టి, అంత కష్టపడి కట్టుకున్న యింట్లో వుండడానికి నోచుకో లేదు.

* * *

హరిబాబు కష్టాలు అంతటితో తీరలేదు. యిల్లు మూడేళ్ళ కంట్రాక్టుమీద అద్దె కిచ్చాడు. కాని అతనున్న యింటి యజమాని యిల్లు ఖాళీ చెయ్యమని నోటీసిచ్చాడు. హరిబాబు కదిలితేగాని అద్దె పెరగదని తెలుసు అతనికి. ఇప్పుడు హరిబాబుకి యింటి సమస్య తలెత్తింది. స్వంత ఇంటికి వెళ్ళాలన్నా మూడేళ్ల కంట్రాక్టు రాశాడు. మరో ఇల్లు యింత ప్రయత్నించినా దొరకలేదు. ఆఖరికి ఇల్లుగలాయనతోపాటు కోర్టుకెక్కాడు.

ఆఖరికి కేసు యిల్లుగలాయన గెలిచాడు. అప్పటికి అతను రిటైరయ్యాడు. మళ్ళీ హరిబాబు అద్దెయిళ్ల వేటలో పడ్డాడు. □

---

మినీ కథ

# తనదాకావస్తే?

"ఇవ్వాళ మా ఆయనకి లేబ్‌లో పనుంధిట. కూరగాయలకి వెళ్దాం వస్తారా?" రాధాదేవి విమల గార్ని అడిగింది. ఆవిడ వెంటనే ఒప్పుకుంది. ప్రతి ఆది, శుక్ర మంగళవారాలు కళ్యాణ్ పూర్‌లో సంత జరుగుతుంది. కూరలు చవగ్గా దొరుకుతాయి. విమలగారు తయారై వచ్చింది సంచీ, బుట్టలతో. యిద్దరూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"మొన్న ఆ మీనాక్షి గారితో వెళ్ళానా? మొగుడు అసిస్టెంట్ ప్రొఫసరయినా అంత పీనాసే మిటండీ ఆవిడ! కళ్యాణ్‌పూర్‌కి టెంపోవాడు తీసుకున్నది లక్షనా ఏమన్నానా? మహా అయితే పావలా! అదికూడా ఖర్చు ఆవిడకి. అంతవరకూ నడిచే వెళ్దామంది. ఎంత గీసి గీసి బేరమాడుతుం దనుకున్నారూ? నాకు చిరాకు బాబు" అంది రాధాదేవి.

"మరే! ఏమిటో ఆ కక్కుర్తి. కట్టుకు పోతుందా ఏమన్నానా?" యిద్దరూ టెంపో కోసం చూడసాగారు. అరగంట గడిచినా టెంపోల జాడలేదు.

"ఈపాటికి నడిస్తే వెళ్ళిపోయి వుండేవాళ్ళం. ఈ టెంపో ఇంక అరగంటకైన వస్తుందో రాదో? పిల్లలు వచ్చేవేళకి ఏదో ఒక టిఫిన్ చెయ్యాల" రాధాదేవి విసుక్కుంది.

"మరే! మావారుకూడా టీకి ఎవర్నోపిల్చారు. అప్పుడే మూడైనట్టుంది, పోనీ నడుద్దామా?" విమలగారు అంది.

"నడుద్దాం పదండి. పట్టుమని పదినిముషాలుకూడా పట్టదు. ఎంత దూరం ఏమిటి? టెంపో వాడు పావలా మింగుతాడు. పావలా అయినా పొదుపు పొదుపేకదండీ. నడక ఒంటికి ఆరోగ్యం కూడాను. ఏమంటారు?"

"బాగా చెప్పారు. ఈ కాన్పూరు నీళ్ళకి తెగ ఒళ్ళు వస్తుందండీ. ఎంత తిండి మానేసినా తగ్గదు. యిలా అప్పుడప్పుడు నడవడం మంచిదే!"

—ముక్కామల వసుంధరాదేవి.